# బానిస బ్రతుకు

♦ "జ్ఞానశ్రీ" ♦

★

"నాలోవున్న సర్వశక్తులనూ నాశనంచేసేరు... జీవితాన్ని దుర్భరంగా మార్చేరు... భౌతికవాంఛలను త్రుంచిపారేసారు...చీకటికోణంలో నిలిపి పకపకనవ్వుతూ స్వార్ధపుతాటికి నా తలకాయను కట్టి ఉచ్చులు బిగించేరు...

ఎవరో తెలుసా...ఈ నా జీవితాన్ని యీలా తయారుచేసింది యెవరో తెలుసా ..., తెలియదు అమాయకత్వంలోపడి కొట్టుకుంటున్న మీకు తెలియదు. ఆసంగతి నాకు తెలుసు. అందుకే మీవంటి అమాయకహృదయాలకు నేను చాలా దూరంగా వుంటానికి ప్రయత్నిస్తూవుంటాను..."

లోకం ఆమెను పిచ్చిదానిగా జమకట్టింది... ప్రజలంతా సర్టిఫైచేసి అలానే పిలుస్తున్నారు... కాని నాకు మాత్రం ఆమెలో పిచ్చికి బదులు అనుభవ పురస్కర జ్ఞానం కనుపిస్తున్నాది ... ఆమెను ప్రశ్నించే...

"మీమాటలుబట్టి లోకం నిర్ణయించిన పిచ్చిదనం మీలో నాకు కనిపించలేదు... మరి మీరు ఎందుకు ఈలా మారిపోయేరో చెప్పగలరా...అదైనా నిర్బంధంకాదు...యిష్టముంటేనే..."

ఆమె నామాటకు జవాబుగా ఓ పెద్దనవ్వు నవ్వింది. నేను ఆశ్చర్యపోయే... ఇంతలో ఆమె తేరుకుని...

"ఒకమనిషి రక్తమాంసాలను మరో మనిషి యెందుకు పీల్చుకుతింటాడు...ఒక ఉద్యోగి తనచేతి క్రింద పనిచేస్తున్న గుమస్తాని ఎందుకు ఏడిపించుకు తింటాడు...ధనవంతుడు ధనహీనున్ని ఎందుకు తిరస్కరిస్తాడు...???

మీకు తెలుసునా...స్వార్ధమనే మహాపిశాచానికి పట్టుబడి యీసడిస్తాడు—అలానే స్వార్ధమనేదానికి చిక్కిపోయిన పిశాచాల దుర్నయాల వల్ల యీలా తయారయేను...

అంటూ భోజనం ముగించి చెయ్యి కడుక్కొని వచ్చి కూర్చుంది. నేను ఆమె విశ్వాసయుత ఆత్మ తీర్మానాలను విందామనే కుతూహలంతో వాలు కుర్చీలో చతికిలబడ్డాను...

ఆమె చెప్పుకుపోతున్నాది...

"పరిస్థితులు ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్నా జీవించాలనే ఆశ నాలో యెక్కువగావుంది...కష్టాలను యెదుర్కోలేక చచ్చిపోటంబట్టి పిరికితనం అనిపించుకుంటుంది కష్టాలకు బలిగా ప్రాణాలను ఒడ్డటం నాకు యిష్టంలేదు...మీదుమిక్కిలి పరమ అసహ్యంకూడా..."

అంటూ నావేపు చూస్తుంది...

నేను ఆలోచనారహితంగా మీ జీవితగాధ తెలియజేసేరుకాదు—అంటూ ఆమెముఖంలోకి చూసేను.

ఆమె ఒక్కసారి నావేపు తీక్ష్ణంగా చూసి... క్షణంలో మందహాసంగా మార్చి...

"మీరు వట్టి పిచ్చివారిలా వున్నారే...మీరు వింటున్నది నా జీవితగాధ కాకపోతే మరొకరిదని యేలా అనుకుంటున్నారు ..మీ సానుభూతి పొందటానికే గాని నామనస్సు అంగీకరిస్తే నేను నాకథ మరోలా ప్రారంభించేదాన్ని...అట్టితలంపు నాలో కలగలేదు...ఎప్పుడూ కలగదు కూడా. విన్నారా"

అంటూ రెట్టించింది...

లోకం పిచ్చిదానిగా నిర్దేశించిన ఒక స్త్రీ నన్ను ఒక పిచ్చివాడిగా జమకట్టింది,...,సాంఘిక దురాచారాలు ఖండించ కథానికలు వ్రాస్తున్న ఒక రచయితను పిచ్చివాడికా చూస్తున్న ఆమె మూపుకు నేను చిన్నపోయేను...ఇదిగ్రహించిన ఆమె జాలిగా నావేపుచూస్తూ...

"మీరు చిన్నపోనక్కరలేదు...,న్యాయాన్యాయ విచక్షణలేక ఒక స్త్రీని బానిసగా మార్చి

అవసరము తీరినవెంటనే పిచ్చిదన్న యోగ్యతాపత్ర మిచ్చి పురుగులా పారేసిన సంఘం పిచ్చిదికాబోతే తెలివైనదని ఏలా అనుకోమంటారు...???

నా తల్లిదండ్రులు నా చిన్నతనంలోనే పోయేరు...స్వార్థమనే విషం గొంతువరకూ త్రాగిన మేనమామ నాఆస్తిని చూచి నన్ను తీసుకుపోయేడు... అప్పటినుంచి నా బానిసబ్రతుకు ప్రారంభమైంది—

ఆస్తికిఅధికారిగా మామయ్య...బానిసత్వానికి రాణీగా నేనూ మారిపోయేము...వండటం మొదలు గిన్నెలు అలికే పనులదాక నేనేచెయ్యాలి...ఎందులో కించిత్తు లోటువచ్చినా నాశరీరం దెబ్బలకు అప్పచెప్పవలసిందే...

గృహం నరకరూపంగా మారిపోయింది... ఒక్కక్షణం ఉండలేకపోయేను...అర్ధరాత్రి సమయంలో తీతువుల రొ..లు, కుక్కల కంఠాలు తోడుగా వీధినిపడ్డాను...

ఎక్కడికి వెళ్ళటం...గమ్యస్థానం ఏదని నిర్ణయించుకోటం...అలాగే ఆచీకటిలోపడి దారి తెన్నులులేని మార్గాన ప్రయాణం సాగించేను...

ఒక్కక్షణం ఆగింది...

దక్షత....దయ....న్యాయం లేని సాంఘిక వ్యక్తుల దుర్నయాలకు చిక్కి నీరసించిపోతూన్న నారీలోకాన్ని యథాతథంగా కనబరచిన ఆమె జీవితాన్ని వింటున్న నాకళ్లు చెమ్మగిల్లేయి...

ఆమె తిరిగి ప్రారంభించింది...

"సూర్యోదయమైంది...అరుణకాంతులు నలుదిక్కులా ప్రస్ఫుటింపబడుతున్నాయి...పీకిపోయిన పాదాలను బరువుగా వేసుకుంటూ వీధినిపడ్డాను... నాయవ్వనాన్ని కోరేవారేగాని పొట్టని నింపేప్రయత్నం చేసినవారు యెవ్వరూ కనబడలేదు...అభిమానం ఒకప్రక్క, ఆకలి మరోప్రక్క నన్ను యాచించనిచ్చేయికావు....అలానే ఆ బంగాళా ముందు నిలబడ్డాను...




శృంగారదేవత

యగు మదనుండు వసంతఋతువు గడచిన వెనుక యువతీ జనుల తలవెండ్రుకలలో చిరస్థాయి యగునని మహాకవి కాళిదాసు పలికెను. దేవతలను సైతము ముగ్ధలనుచేసి యాకర్షించు నాకేశసంపదను కేశవర్ధిని నుపయోగించి సర్వకాలములయందు మనోజ్ఞముగ వృద్ధిచేసుకొనరాదా!

కేశవర్ధిని మీ కుంతలములకు ప్రకాశమును, ప్రకాశమునకు తగిన అందము, అందమునకు తగిన యవ్వనము నిచ్చును. విశేషించి బాల్యమునుండియే కుదుళ్ళను గట్టిపరచి రాలనీయక కాపాడును. కేశవర్ధిని తులలేని చక్కని నెన్నెరులను ఆసిరి కురులు మీకద్వితీయ సౌందర్యము నిచ్చును.

# కేశవర్ధిని

నేడే మీకురులకు కేశవర్ధిని వాడుడు

మీ తలవెండ్రుకలను అందముగా పెంచి బలపరచుము.

కేశవర్ధిని అ. 12. కేశవర్ధి సాంపు అ. 12.

(పోస్టేజి ప్యాకింగు వేరు.)

వర్తకులందరియొద్ద దొరకును లేక

సౌత్ యిండియా కెమికల్స్

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.

ఆ నిలటడబమే నా జీవితపతనానికి కారణం అయింది...ఆ బంగళా యజమాని రామప్రసాద్ మాయావాగురులోపడి రెండవసారి బానిసగా మారి పోయేను అయితే యీబానిసత్వం సౌఖ్యంతో కూడుకున్నది...చాకిరీకిబదులు రామప్రసాద్ పనులకోసం శరీరం సమర్పించవలసి వచ్చింది...అదైనా రెండు సంవత్సరాలు మాత్రమే...

నామీదవున్న మోజు తగ్గిపోయింది...ఫలితంగా నాస్థానంలో మీనాక్షి అనే వేశ్య అలంకరించింది...

మరి నాకు ఆయింటిలో వుండివలసిన అగత్యంగాని యిష్టతగాని రామప్రసాద్ కలిగించలేదు సరికదా పూర్తి అవమానము కలిగించి గెంటివేసేడు.

మళ్లీ వీధిని పడ్డాను...

ఈ మాటు నా జీవితం మిల్లుకూలీగా ప్రారంభమైంది.... అంటూ ఆమె వక్కనిట్టూర్పు విడిచింది...

స్వాతంత్ర్యము గోలుపోయి...బానిసత్వానికి అలవాటుపడి...జీవితపాయులను నిక్రృష్టంగా...సంచారం సాగిస్తున్న ఆమె స్వానుభవము లోకానికి ఉపకరించిన, ఆమె మాత్రం ఉపకరించలేదు...

ఆమె తిరిగి ప్రారంభించింది...

"అనాథనై ... బంధుగులకు దూరమై... నమ్మినవానిచే గెంటబడి ... తుదకు మిల్లుకూలీగా జీవితాన్ని తరలించటానికి తయారైన నాకు యిక్కడ కూడా సుఖంలేకపోయింది...

చక్కని కథలకు
"కథాంజలి" చదవండి

కూలిడబ్బులు ఒక్కపూట పొట్టనింపుకోటానికి కూడా సరిపోకుండా వున్నాయి...ఆకలికడుపు అవయవ పోషన తగ్గించింది...శరీరం కృషించిపోయింది...పని మందగించింది...యజమానిచీవాట్లు శరీరాల్ని తూట్లు చేస్తున్నాయి...అలాగే నాలుగు సంవత్సరాలు గెంటేను...అంతకన్నా మరి దిక్కులేకపోయింది..."

ఒక్కడ ఆగి నావేపు చూసింది...

కూలీల రక్తమాంసములు పీల్చి పిప్పిచేసి కరడుకట్టిన రాక్షస హృదయాలతో బ్రతుకుతున్న పెట్టుబడీదారుల అన్యాయాలను రూపు మాపే ప్రజానాయకుడు కనిపించలేదు. స్వార్థపరులు రైతుకూలీల ఎముకలగూడుపై మహాసౌధాలను నిర్మించుకుని పోయి నా బ్రతుకుతున్నారు...

ఇదేనా ధర్మం...ఇదేనా న్యాయం.. ఇదేనా మానవ సౌభ్రాతృత్వము...ఇదేనా అభ్యున్నతికి మార్గం... ???

నాలో ఆవేశాన్ని కనిపెట్టిన ఆమె మందహాసం ఒలికిస్తూ "యువకులు ఆవేశపడ్డా...వృద్ధులు విచారించినా...స్త్రీ లోకం గద్దెయెక్కి ఉపన్యాసాలు దంచినా...ప్రభుత్వం చట్టాలు వేసినా... వీళ్ళంతా పెట్టుబడీదారులకు తలఒగ్గి తిరగవలసిందే లేకపోతే వాళ్ళకు గత్యంతరంలేదు...ఎదిరిస్తే యెరగవూ నాలాటి వాళ్ళంతా పిచ్చివారవటమో... ప్రాణాలు పోగొట్టుకోటమో తథ్యం...

నేను నాకష్టాలను యజమానితో మొరపెట్టుకున్నాను...దానికి బదులుగా నాకు ఆయన రెండు లాటీ దెబ్బలు ప్రసాదించేడు. నాలో యింకా యేమూలో దాంగియున్న రక్తం ఉబికింది...ప్రక్కనే యున్న బాకుతీసి అతని గుండెలోకి పొడిచేను... నేలకి ఒరిగి పోయేడు...

ఆవేశంతో చేసిన యీ పని నా మెదడుని మార్చి వేసింది... నేను ఏం చేస్తున్నానో నాకే తెలియదు...కళ్ళుమూసినా కళ్ళు తెరచినా యీ దృశ్యమే కనుపిస్తున్నాది...పరిగెత్తేదాన్ని ... ఎక్కడికి పరిగెత్తినా యిదే వెంటపడేది...

పోలీసులూ...మనుష్యులూ అంతా మొదటి వేషం వేస్తున్నాది అన్నారు...ఆ తరువాత పిచ్చి ఆసుపత్రిలో చేర్చేరు...కొద్దిరోజు క్రిందటనే విడుదలయ్యేను...విన్నారా...?"

అంటూ వుబ్బెత్తుగా లేచి నుంచుంది... నేను సిగరెట్టు పారేసి లేచి...

"మీ జీవితం యేలా గడుస్తున్నాది..." అంటూ ప్రశ్నించేను—

"ఈ వేళ యేలా జరిగిందో రోజూ అలాగే జరుగుతుంది...జరగనివారు భగవంతునికి ఆజ్ఞ అయిందన్నమాట...ఆ లోకానికి వెళ్ళిపోతా"

అంటూ ముందు గుమ్మందాటి సావిట్లోకి వచ్చింది... నేను జేబులోంచి రెండు పదిరూపాయల నోట్లుతోసి ఆమెకు చూపుతూ...

"ఇందండి ఈ అనామకుడు ధర్మంగా యిస్తున్న ఈతృణం గ్రహించి మరీ వెళ్ళిపోండి."

అంటూ ఇవ్వబోయేను...

ఆమె అతి తీవ్రంగా నా వేపు చూచి...

ధర్మం గ్రహించేమంటే దారిద్ర్యాన్ని అభివృద్ధి చేసుకోటమే అవుతుంది...నా దారిద్ర్యాన్ని నేను అభివృద్ధిచేసుకోలేను క్షమించండి..."

అంటూ చరచరా వెళ్ళిపోయింది...

నేను నిర్ఘాంతపడి అలానే వుండిపోయేను...

అంతే—

